



జై జగన్నాథ

- వైభవంగా పూరిజగన్నాథ రథయాత్ర
- భారీగా తరలివచ్చిన భక్తులు

నిజామాబాద్ అర్బన్, జూలై 12: ఇస్కాన్ కంఠేశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో ఘనంగా శ్రీజగన్నాథ రథయాత్ర కన్నుల పండువగా జరిగింది. నగరంలోని కంఠేశ్వర్ ఆలయం నుంచి విజయలక్ష్మి గార్డెన్ వరకు కొనసాగిన రథయాత్రలో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇస్కాన్ అధ్యక్షుడు రామానందరాయ్ గౌరదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథయాత్రలో నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, టెంపుల్ అధ్యక్షుడు వేదాంత ప్రగతి, ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచార్ శివకుమార్‌లు పాల్గొని జగన్నాథ యాత్ర గురించి గొప్పగా వివరించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం ఆడుతూ రథయాత్రలో పాల్గొన్నారు. కంఠేశ్వర్ నుంచి మొదలైన రథయాత్ర రైల్వే కమాన్, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్, బస్టాండ్, గాంధీచౌక్, పెద్దబజార్, శివాజీనగర్, పూలాంగ్ మీదుగా విజయలక్ష్మి గార్డెన్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు స్వామియాదవ్, ఇస్కాన్ ప్రతినిధులు రఘు, ఆదిపురుషాందస్, ఆదిగురుదాస్, రమణగోపెదాస్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



- స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



- జగన్నాథుడి ఊరేగింపు



- రథం లాగుతున్న భక్తులు







- రథయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు



- అసంపూర్తిగా ఉన్న దహన వాటికలు

కబ్జాలో శ్మశాన భూములు

- ఆక్రమణలో మోర్తాడ్‌లోని శ్మశాన వాటిక స్థలం
- నాలుగు ఎకరాల స్థలంలో అధిక భాగం కబ్జా
- అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- అధికారులు హద్దులు ఏర్పాటు చేయాలంటున్న గ్రామస్థులు
- మూడేళ్లుగా పూర్తికాని వైకుంఠధామ నిర్మాణ పనులు

మోర్తాడ్, జూలై 12: మండల కేంద్రంలో నిర్మిస్తున్న శ్మశాన వాటిక స్థలం కబ్జాకు గురవుతోంది. శ్మశానానికి సంబంధించిన భూమి సుమారు నాలుగు ఎకరాల వరకు ఉండేదని, అందులో అధిక భాగం ఆక్రమణకు గురైందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గతంలో ఈ విషయంపై అన్ని కుల సంఘాలతో సమావేశం కూడా ఏర్పాటు చేసి అప్పటి తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో రెవెన్యూ అధికారులు శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించి హద్దులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే అది ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. అలాగే వైకుంఠధామం నిర్మాణ పనులు సైతం మూడేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఎస్సీవాడ శివారులో గోవింద్‌రెడ్డికాలనీ వెనక భాగంలో గల ఈ శ్మశాన వాటిక గత కొన్ని దశాబ్దాలుగా ప్రజలు వినియోగించుకుంటున్నారు. కాగా, గత ప్రభుత్వ హయాంలో వైకుంఠధామం నిర్మాణానికి ఉపాధిహామీ పథకం ద్వారా రూ.12 లక్షల 60వేలు మంజూరయ్యాయి. అప్పటి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి 2021 జనవరి 7న వైకుంఠధామం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మూడున్న రేళ్లుగా దీని నిర్మాణం పూర్తి కాలేదు. మోర్తాడ్ లోని జనాభాలో సగం భాగం ప్రజలు ఈ శ్మశాన వాటికను వినియోగించుకుంటున్నారు. వైకుంఠధామంలో రెండు దహన వాటికలు, కాటికాపరి గది, శ్మశానానికి వెళ్లే ప్రవేశ ద్వారం పనులు కొద్ది శాతం మాత్రమే మిగిలి ఉన్నాయి. దహన వాటికలు పూర్తి కాక పోవడంతో బయటనే శవదహనాలు చేస్తున్నారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా స్నాన వాటికలు పూర్తయ్యాయి. అయితే శ్మశానానికి వెళ్లే కంకర రోడ్డు గుంతలు పడి కంకర తేలి ప్రజలకు అసౌ కర్యంగా మారింది. అలాగే రెవెన్యూ అధికారులు సమగ్రంగా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



- అసంపూర్తిగా కాపరి గది





మధ్యాహ్న భోజనంలో పురుగులు

- నీళ్ల చారు.. రంగుమారిన బియ్యం.. ఉడికించని కూరగాయలతో విద్యార్థులకు భోజనం
- మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుల ఇష్టారాజ్యం
- ఆందోళనలో విద్యార్థినుల తల్లిదండ్రులు
- కోటగల్లి ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఘటన
- మధ్యాహ్న భోజన ఏజెన్సీల సంఘం జిల్లా అధ్యక్షుడి సోదరుడే ఏజెన్సీ నిర్వాహకుడు

నిజామాబాద్ అర్బన్, జూలై 12: పేద, మధ్యతరగతి పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని ఉద్దేశ్యంతో ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల నీరుగారుతోంది. కనీసం విద్యార్థులకు నాణ్యమైన భోజనం కూడా అందించలేని పరిస్థితుల్లో నిర్వాహకులు ఉన్నారు. పురుగుల అన్నం, నీళ్ల చారుతో విద్యార్థులు తినలేని పరిస్థితుల్లో భోజనం ఉంటుందంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. ఒకే ఏజెన్సీ నగరంలోని పదుల సంఖ్యలో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని నిర్వహిస్తుండటంతో వారు చెప్పిందే వేదం.. చేసిందే చట్టంగా మారింది. అధికారులు సైతం చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో ఏజెన్సీ నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. శుక్రవారం నగరంలోని కోటగల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు రావడం, పప్పు సైతం నీళ్లలా ఉండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించారు.
ప ప్పు క ం
బ ద ం లు
పిం డి
క లు పు
తున్నా
ర ని



- మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం

కూరగాయలు సైతం ఉడికించకుండానే వడ్డిస్తున్నారని, రంగుమారిన బియ్యాన్ని కనీసం కడగకుండా వండటంతో అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల సంఘం జిల్లా అధ్యక్షుడి కుటుంబ సభ్యులే కోటగల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల సంఘం అధ్యక్షుడికి నగరంలో బినామీ పేర్లతో 10 వరకు పాఠశాలల్లో ఏజెన్సీలు ఉండటంతో ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను బెదిరించే స్థాయికి వెళ్తున్నట్లు తెలుస్తోంది. నాణ్యమైన భోజనం పెట్టాలని ఎవరైనా అడిగితే వారిపైనే దాడులు చేసే పరిస్థితి నెలకొంది. కోటగల్లి బాలికల పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు ఉండగా ప్రతిరోజూ 500 వరకు విద్యార్థులు హాజరవుతున్నారు. కేవలం 200 మందికి సరిపడా సరుకులతోనే 500 మందికి భోజనాన్ని అందిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. మధ్యాహ్న భోజన ఏజెన్సీల సంఘం జిల్లా అధ్యక్షుడి సోదరుడు కోటగల్లి పాఠశాలలో ఏజెన్సీని నిర్వహిస్తున్నాడు. గత వారం రోజులుగా సక్రమంగా భోజ నం పెట్టకపోగా పురుగులు పట్టిన అన్నాన్ని పెడుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు మధ్యాహ్న భోజన తీరుపై విచారణ జరిపి తమకు నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



- నీళ్లచారులా ఉన్న పప్పు



- మధ్యాహ్న భోజనంలో పురుగులు

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- కమ్యూనిటీ హెల్త్ సెంటర్, పాఠశాలల తనిఖీ


వర్ని, జూలై 12: ప్రభుత్వ ఆసుపత్రులకు ఎంతో నమ్మకంతో వచ్చే నిరుపేదలు, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి, సర్కారు దవాఖానాల పనితీరుపై మరింత నమ్మకాన్ని పెంపొందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ప్రత్యేకాధికారులు, సిబ్బందికి హితవు పలికారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. 30పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో రిజిస్ట్రేషన్ కౌంటర్, అవుట్ పేషంట్, ఇన్ పేషంట్ విభాగాలు, వివిధ వార్డులను సందర్శించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఆరోగ్య మేళా సందర్భంగా అందిస్తున్న ప్రత్యేక వైద్య చికిత్సలు, మధుమేహం, రక్తపరీక్షలు చేస్తున్న తీరును పరిశీలించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగానే కాన్పులు చేస్తున్నారా ? అని వైద్యులను ఆరా తీశారు. సాధారణ ప్రసవాలను స్థానికంగానే చేస్తున్నామని, హైరిస్క్ కేసులను బోధన్‌లోని జిల్లా ఆసుపత్రికి నిజామాబాద్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నామని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. రోగులను పలుకరించి వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. వైద్యులు అందుబాటులో ఉండటం లేదని పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా గల అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించేలా పర్యవేక్షణ చేయాలని, సంతృప్తికర స్థాయిలో సేవలందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి..

పాఠశాలల్లో మౌలిక వసతులను పెంపొందించేందుకు చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించేలా చూడాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన వర్ని మండలంలోని శ్రీనగర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, సత్యనారాయణ పురంలోని ప్రభుత్వ బాలికల జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. తుది దశలో మిగిలి ఉన్న పనులను సైతం నాణ్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పాఠశాల ఆవరణను చదును చేయించి మొరం వేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి తుకారం రాథోడ్, డీఈఓ ఎస్వీ.దుర్గాప్రసాద్ తదితరులున్నారు.



వైద్యులు సక్రమంగా ఉండడం లేదని కలెక్టర్‌కు విన్నవిస్తున్న బాధితులు



ప్రభుత్వ ఉపాధ్యాయులకు బదిలీలు సహజం

రెంజల్,జూలై12: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సహజమని మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సోమలింగం గౌడ్ అన్నారు. శుక్రవారం దూపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన పీఆర్‌టీయూ మండల కార్యదర్శి సాయిరెడ్డి బదిలీపై వెళ్లడంతో ఆయనను ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 12ఏళ్లుగా ఎందరో విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్ది వారి మన్ననలు పొందుతూ ప్రస్తుతం బదిలీపై వెళ్లిన సాయిరెడ్డి సేవలు మరువలేనివన్నారు. సాయిరెడ్డిని శాలువా, పూలమాలలు, మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. తమ పాఠశాలలో అంకిత భావంతో విధులు నిర్వహించి తల్లిదండ్రులు, గ్రామస్థుల మన్ననలు పొందడం జరిగిందని గుర్తుచేశారు. పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యాయుడిగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో తన కర్తవ్యాన్ని చాటిన వాడన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు వెంకట లక్ష్మి, ఉపాధ్యాయులు లక్ష్మి, దేమ్మ, కృష్ణ, సాయన్న, ప్రభాకర్, రాజేశ్వర్, సురేష్, అర్చన, వసంత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

పెర్కిట్, జూలై12: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎంబీఏ విద్యార్థులు ఫేర్వేల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంబీఏ కోర్సు పూర్తి చేసుకొని బయటకు వెళ్లే విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని క్షత్రీయ విద్యాసంస్థల మంచి పేరు తీసుకు రావాలని విద్యాసంస్థల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ అన్నారు. విద్యార్థిని, విద్యార్థులు డ్యాన్స్‌లు, నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్‌కె.పాండే, హెచ్‌వోడీ డాక్టర్ సుధాకర్, క్షత్రీయ మేనేజ్‌మెంట్ పరీక్షిత్, విరేంధర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

తాను మృతిచెందినా... మరో నలుగురికి ప్రాణం పోసిన యువకుడు


భిక్కనూరు, జూలై 12 : ఇటీవల మెదక్ జిల్లా రామాయంపేటలో జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన మండలం లోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన మెట్టు ప్రవీణ్(32) హైదరా బాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. ఈ సందర్భంగా గ్రామస్థులు, మృతుడి స్నేహితులు మాట్లాడుతూ ప్రవీణ్ మృతిచెందిన అతడి అవయవాలు దానం చేస్తే మరో నలుగురికి ప్రాణదాతగా నిలుస్తాడని ఆసుపత్రి వైద్యులు కుటుంబ సభ్యులను కోరగానే వారు అవయవదానంకు ఒప్పుకున్నారని, అవయ వదానం అనంతరం ప్రవీణ్ మృతదేహానికి ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది ఘనంగా నివాళి అర్పించినట్లు తెలిపారు. కాగా తాను మృతి చెందిన మరో నలుగురికి ఊపిరి పోసిన ప్రవీణ్ మృతదేహాన్ని హైదార బాద్ నుండి అంబులెన్స్‌లో గ్రామానికి తీసుకురాగా గ్రామ సరిహద్దు నుంచి స్నేహితులు, గ్రామస్థులు బైక్‌ర్యాలీతో, టపాసులు కాల్చుతూ ప్రవీణ్ జోహార్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ఇంటి వరకు తీసుకెళ్లారు అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో మెదక్ జిల్లా రామాయంపేట, భిక్కనూరుతో పాటుగా మండలంలోని చాలా గ్రామాలనుంచి వందల సంఖ్యలో యువకులు, స్నేహితులు పాల్గొన్నారు.

భిక్కనూరు టీయూ సౌత్‌క్యాంపస్‌లో విద్యార్థుల ధర్నా


భిక్కనూరు, జూలై 12: భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో ఉన్న తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో విద్యార్థులు శుక్రవారం పరిపాలన భవనం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలు ఉన్నందున సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. తాము ఎట్టి పరిస్థితుల్లో ఈ సెమిస్టర్ పరిక్షలు రాయబోమని, అధికారులు స్పందించి సెమిస్టర్ పరిక్షలను వాయిదా వేయాలని కోరారు. అనంతరం ప్రిన్సిపాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

టీయూ సౌత్‌క్యాంపస్‌లో పాము కలకలం

భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో శుక్రవారం పాము కలకలం రేపింది. సౌత్‌క్యాంపస్ ఆవరణలో ఉదయం పామును గమనించిన విద్యార్థులు హాస్టల్ వార్డెన్, సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే వారు జంగంపల్లి గ్రామానికి చెందిన స్నేక్ స్నాచర్ మోహన్‌రెడ్డికి సమాచారం అందివగానే వెంటనే ఆయన చేరుకుని పామును పట్టుకుని అడవిలో వదిలిపెట్టాడు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సందర్భంగా పాముల బెడద ఎక్కువగా ఉంటుందని, విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించి విషపూరిత, విషరహిత పాములపై విద్యార్థులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ యాలాద్రి, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.











బాగేపల్లిలో ఈత మొక్కలు నాటిన ఎక్సైజ్ సీఐ

రెంజల్, జూలై 12 : మండలంలోని బాగేపల్లి గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవంలో భాగంగా బోధన్ సీఐ పవన్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలోని బేబీకుంట చెరువు గట్టుపై ఈతమొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా బాగేపల్లి చెరువు గట్టుపై ఈతమొక్కలను నాటడం జరిగిందని, ఈ మొక్కలను సంరక్షించుకునే బాధ్యత గ్రామస్థులదేనన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఐదు మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జలీల్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షులు సాయిబాబా గౌడ్, సాయా గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ గోపి, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ సంఘం భవన నిర్మాణానికి నిధుల మంజూరు

వేల్పూర్, జూలై 12 : మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో దేవాంగ సంఘం కమ్యూనిటీ హాల్‌భవన నిర్మాణానికి రూ.5లక్షల మంజూరయ్యాయి. శుక్రవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డిలత సహకారంతో మంజూరైన ప్రొసిడింగ్ కాపీని స్థానిక కాంగ్రెస్ నాయకులు గుడాల మోహన్, తక్కురి గంగాధర్‌లు దేవాంగ సంఘ సభ్యులకు అందజేశారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించే దిశలో ముందుకుపోతుందని కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్టువతల నర్సయ్య, నచ్చన్న గారి గంగారెడ్డి, చేపూర్ మోహన్, నెహ్రూ, అలీం, జల్ల భూమన్న, స్టూడియో బాబు, దేవాంగ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టీయూలో డ్రాయింగ్ పోటీలు

డిచ్‌పల్లి, జూలై 12 : తెలంగాణ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎంబీఏ విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈవెంట్‌లో భాగంగా విద్యార్థులు వివిధచిత్రలు గీశారు. డ్రాయింగ్‌లో గెలుపొందిన వారికి ప్రొఫెసర్ ఆంజనేయులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. డ్రాయింగ్‌లో ప్రథమ బహుమతి అనూజ, ద్వితీయ బహుమతి పూజ, తృతీయ బహుమతి సుహాసినిలు గెలుపొందారు. కార్యక్రమంలో అధ్యాపకులు హారతి, కైసర్ మహమ్మద్, వాణి, పాల్గొన్నారు.

కోటగిరి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా జానకీరావు

కోటగిరి,జూలై12: కోటగిరి లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా వై.జానకీరావు ఎన్నికయ్యారు. బోధన్ లయన్స్ క్లబ్ కార్యాలయంలో శుక్రవారం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పత్తి లక్ష్మణ్, కోశాధికారిగా సాయిశ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. లయన్స్‌క్లబ్ కార్యవర్గాన్ని మాజీ డిస్ట్రిక్ గవర్నర్ బసవేశ్వర రావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు హన్మంతరావు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'బ్యాంక్ మేనేజర్ సేవలు మరువలేనివి'

ఎడపల్లి, జూలై 12 : మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజరు మేఘనకు శుక్రవారం బ్యాంకు ఖాతాదారులు ఘనంగా సన్మానించారు. మూడు సంవత్సరాలుగా తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వహించిన మేఘన ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించి, బ్యాంకును లాభాల్లోకి తీసుకెళ్లి, బ్యాంకు సిబ్బందితోపాటు ఖాతాదారులకు, రైతులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమంగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లడంతో ఆమె సేవలను కొనియాడుతూ ఆమెకు బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, నాయకులు కామప్ప, అబ్దుల్ వాహబ్ భారీ, రాజిరెడ్డి, కృష్ణారెడ్డి, బ్యాంకు సిబ్బంది తదితరులు ఉన్నారు.

'దాడి చేయించిన వారిని అరెస్టు చేయాలి'

ఆర్మూర్‌టౌన్, జూలై 12 : నందిపేట మండలం తల్వేద గ్రామానికి చెందిన బొమ్మెన పెద్దపెద్దన్నపై దాడి చేయించిన వారిని అరెస్టు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మోహన్‌లు మాట్లాడుతూ దాడికి ప్రేరేపించిన సాయిరెడ్డి అనే వ్యక్తిపై కేసునమోదు చేయాలని లేని యెడల జిల్లావ్యాప్తంగా ఆందోళన చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జీ మోత్కు భూమన్న, సీపీఎం డివిజన్ నాయకులు కుతాడి ఎల్లయ్య, సాయిలు, మురళీ, కొండ గంగాధర్, బి.రవి, సుధాకర్, పోసాని, రవీందర్, నర్సింగ్, అనిత, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

చేపూర్‌లో వివాదాస్పద రోడ్డును పరిశీలించిన అధికారులు

ఆర్మూర్ రూరల్, జూలై 13 : మండలంలోని చేపూర్‌లో వివాదాస్పద జంబి రోడ్డును శుక్రవారం ఆర్మూర్ తహసీల్దార్ గజానన్, సీఐ రవికుమార్‌లు పరిశీలించారు. గ్రామస్తులు సబ్‌స్టేషన్, జంబిపూజకు వ్యవసాయ తోటలకు వెళ్లే దారిని సారంగి విజయ్ అనేవ్యక్తి దౌర్జన్యంగా మూసివేశారని, ఇటీవల గ్రామస్తులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు వివాదాస్పద రోడ్డును పరిశీలించి గ్రామస్థులను పూర్తివివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు గతంలోనే ఉందని, గ్రామస్థులు అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇందూర్ సాయన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్‌కె.చిన్నారెడ్డి, వీడీసీ అధ్యక్షుడు మేడిపల్లి శ్రీకాంత్, కోశాధికారి రుక్మాజీ, మాజీ ఎంపీటీసీ జన్నెపల్లి గంగాధర్, దాసరి శ్రీకాంత్, శాంతికు మార్, నాగరాజు, సింధూకర్ చరణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవీపేట, జూలై 12 : మండలంలోని నిజాంపూర్ 33/11సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని నవీపేట ట్రాన్స్‌కో డీఈ సుహాసిని తెలిపారు. నిజాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని నిజాంపూర్, బినోల, ఆశాజ్యోతి కాలనీలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని, ఈ విషయంలో వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

స్టూడెంట్స్ కౌన్సిల్ సభ్యుల ప్రమాణ స్వీకారం

నవీపేట, జూలై 12 : మండలంలోని జన్నేపల్లి ఎస్ఎస్ఆర్ పాఠశాలలో ఇటీవల జరిగిన స్టూడెంట్స్ కౌన్సిల్ ఎన్నికలలో గెలుపొందిన కమిటీ సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. పాఠశాల హెడ్‌గర్ల్‌గా అనన్య, హెడ్ బాయ్‌గా రాణాప్రతాప్‌లతో పాటు సాంస్కృతిక, క్రమ శిక్షణ, క్రీడా కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ మారయ్య గౌడ్, సీఈవో హరితగౌడ్, ప్రిన్స్‌పాల్ భాస్కర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'పర్యావరణాన్ని కాపాడడం ప్రతీ ఒక్కరి బాధ్యత'



సరస్వతి విద్యామందిర్‌లో మొక్కలు నాటుతున్న ఏసీపీ బస్వారెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూలై 12 : పర్యావరణాన్ని కాపాడడం ప్రతిఒక్కరి బాధ్యత అని ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్మూర్ పట్టణంలోని సరస్వతి విద్యామందిర్‌లో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ బస్వారెడ్డి మాట్లాడుతూ ప్రతీఒక్కరు మొక్కలు నాటడమే గాకుండా నాటిన మొక్కలు సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సంచాల సమితి అధ్యక్షుడు, సీనియర్ బీజేపీ నాయకుడు లోకభూపతిరెడ్డి, పాఠశాల కార్యదర్శి రవినాథ్, ప్రబంధ కారిణి కమిటీ అధ్యక్షుడు వంశీ, కార్యదర్శి మహేష్, వైస్‌ప్రెసిడెంట్ జనార్దన్ కిరణ్, ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్, అభిమాన్యు, శైలజ, సోనాలి, శ్రీవిద్య, సింధుజ, లత, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో 20న ఊరపండుగ

బోధన్‌రూరల్, జూలై 12 : బోధన్‌లో ఈ నెల 20వ తేదీన ఊరపండుగ నిర్వహించనున్న సందర్భంగా శుక్రవారం బోధన్ గ్రామ నడిబొడ్డున చావిడి వద్ద ముడుపు వేశారు. వారం రోజుల పాటు గ్రామస్థులు గ్రామ ఆచారాలు, సంప్రదాయాలను తప్పకుండా పాటించాలని బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు బాగారెడ్డి అన్నారు. ఊరపండుగతో గ్రామ దేవతలు శాంతిస్తారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే సరఫరా చేయాలి

● మధ్యాహ్నభోజన కార్మికుల డిమాండ్

కోటగిరి, జూలై 12 : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి అవసరమైన కోడిగుడ్లు, నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే సరఫరా చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు విఠల్‌గౌడ్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలల నుంచి బిల్లులు రాక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్మికులు తమ వద్ద ఉన్న వస్తువులు, ఆభరణాలను తాకట్టు పెట్టి వంటలు చేస్తున్నారని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువులను సరఫరా చేయడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కార్మికులకు 10 వేల రూపాయల కనీస వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు రమణ, ఉషారాణి, వీరేశం, అలీ, భూమయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

వేల్పూర్ :పాఠశాలల మధ్యాహ్న భోజనంకు కోడిగుడ్లు, నిత్యావసర వస్తువులతో పాటు గ్యాస్‌ను కూడా సరఫరా చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపునురు చక్రపాణి డిమాండ్ చేశారు. శుక్రవారం వేల్పూర్‌లో ఎంఈవో కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి బిల్లులు రాకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అప్పు తెచ్చిన డబ్బులతో కిరాణ దుకాణంలో నిత్యవసర వస్తువులు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వంట చేసే ముందు కచ్చితంగా కోడిగుడ్లు, రాగిజావా పెట్టాలని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు.

విద్యుదాఘాతంతో మేకలు, గొర్రెల మృతి

● పశువుల కాపరికి త్రుటిలో తప్పిన ప్రాణపాయం

వర్ని, జూలై 12 : చందూర్ మండల కేంద్రం శివారులో శుక్రవారం విద్యుదాఘాతంతో గొర్రెలు, మేకలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన అరికెల సాయిరెడ్డి అనే వ్యక్తి తన మేకలు, గొర్రెలను మేపుతుండగా చందూర్ గ్రామ బస్టాండ్ శివారులో ఓ పొలం వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ తీగల ద్వారా విద్యుత్‌షాక్ తగలడంతో మూడు మేకలు, గొర్రె అక్కడికక్కడే మృతిచెందాయి. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగలు నూటల్‌గా భూమిలో పాతగా విద్యుత్ సరఫరా డైరెక్ట్ అయింది. దీంతో అక్కడే మేస్తున్న మేకలు, గొర్రెలు ప్రమాదానికి గురయ్యాయి. అదే సమయంలో తన గొర్రెలు, మేకలను మేపుతున్న అరికెల సాయిరెడ్డి మిగత మేకల గుంపుకు ఎలాంటి ప్రాణపాయం జరగకుండా వాటిని దూరంగా తరిమేశాడు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగ దగ్గరే ఉన్న సాయిరెడ్డి ప్రమాదాన్ని గ్రహించి పక్కకు దూకడంతో విద్యుత్ షాక్ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. తాను ప్రమాదాన్ని గుర్తించకపోతే తనకు కూడా విద్యుత్‌షాక్ తగిలేదని బాధితుడు పేర్కొన్నాడు. ప్రమాద నిర్లక్ష్యానికి కారకులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు. ఈ ఘటనతో తనకు 60 వేల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు


విద్యుదాఘాతంతో మృతి చెందిన మేకలు, గొర్రెలు

ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి


నాటిన మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్

జక్రాన్‌పల్లి, జూలై12: ప్రతీఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. శుక్రవారం మండలంలోని కలిగోట్ గ్రామంలో వనమహోత్సవంలో భాగంగా గ్రామంలో నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. రోజువారిగా మొక్కలు నాటడం వల్ల ఒక కూలీకి ఎంత కూలీ పడుతుందని ఉపాధి కూలీలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఆదర్శ రైతు రంగు భూమాగౌడ్ వ్యవసాయ క్షేత్రంలో పెరుగుతున్న పంటను అదనపు కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో సతీష్‌కుమార్, ఏపీవో రవి, సెక్రె టరీ, ఎఫ్ఏలు, ఉపాధిహామీ కూలీలు ఉన్నారు.

ఇరిగేషన్ స్థలంలో అక్రమ నిర్మాణం

నవీపేట, జూలై 12 : మండలంలోని స్టేషన్ ఏరియాలోని ఇరిగేషన్ కార్యాలయం ఆవరణకు చెందిన ఖాళీస్థలంలో అక్రమ నిర్మాణం బయట పడింది. కార్యాలయం స్థలం ముందు ఉన్న ఇంటి యజమాని అఫ్రోజ్‌ఖాన్ కొన్నినెలల నుంచి పాత బట్టలతో తన ఇంటిని ఆనుకుని ఇరిగేషన్ స్థలంలో అడ్డంగా పరదా కట్టాడు. ఈ విషయాన్ని సంబంధిత శాఖ అధికారులు అంతగా పట్టించుకోలేదు. సంబంధిత పరదా వెనుక అఫ్రోజ్‌ఖాన్ అక్రమ నిర్మాణం చేపట్టాడు. ఈ విషయాన్ని పలువురు స్థానికులు ఇటీవల బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఇరిగేషన్ అధికారులు అక్రమ కట్టడాన్ని మూడురోజుల్లో తొలగించాలని నోటీసులు అందజేశారు. గత రెండున్నర మాసాల క్రితం గ్రామ పంచాయతీ కార్యదర్శి నవ్యశ్రీ సైతం అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని అఫ్రోజ్‌ఖాన్‌కు నోటీసులు అందజేశారు. శుక్రవారం ఇరిగేషన్ డీఈ బలరాం, ఏఈ శ్రీధర్, ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నవ్యశ్రీల ఆధ్వర్యంలో ఇరిగేషన్ స్థలంలో ఏర్పాటు చేసిన పరదా తొలగించగా దాని వెనుక పిల్లర్లతో పక్కా నిర్మాణం బయట పడడంతో అధికారులు అవాక్కయ్యారు. వెంటనే అక్రమ నిర్మాణాన్ని సిబ్బందితో తొలగిస్తుండగా అఫ్రోజ్‌ఖాన్ కుటుంబానికి చెందిన పలువురు మహిళలు వారికి అడ్డుగా నిలబడడంతో తొలగింపు ప్రక్రియను నిలిపివేశారు. ఇదే సమయంలో జేసీబీని సైతం రప్పించినప్పటికీ దానిని వెనక్కి పంపించారు. లక్షలాది రూపాయల విలువైన ఇరిగేషన్ స్థలంలో గత కొన్ని నెలలుగా అక్రమ నిర్మాణం జరుగుతున్నా పక్కనే కార్యాలయంలో ఉన్న అధికారులు గుర్తించకపోవడం వారి పూర్తి నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఈ సంఘటనతో చర్చించుకుంటున్నారు.


ఇరిగేషన్ స్థలంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణం

టీయూలో పరిపాలనా భవనం ముట్టడి

డిచ్‌పల్లి, జూలై 12 :పోటీపరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 15 నుంచి తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో జరుగనున్న పీజీ పరీక్షలు వాయిదా వేయాలని పీజీ విద్యార్థులు శుక్రవారం తెలంగాణ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం ముట్టడించారు. సుమారు 2 గంటల పాటు ఆందోళన చేశారు. ప్రభుత్వం పోటీపరీక్షలు నిర్వహిస్తున్న తరుణంలో వర్సిటీ అధికారులు పీజీపరీక్షలు నిర్వహించడం సరి కాదని, పీజీపరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. టీయూ రిజిస్ట్రార్‌ప్రొఫెసర్ యాదగిరి ఎదుట ఆందోళనకు దిగారు. ఆందోళన ఉధృతం కావడంతో సమాచారం అందుకున్న డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై మహేశ్‌లు వర్సిటీకి చేరుకొని విద్యార్థులను శాంతింప జేసేందుకు ప్రయత్నించారు. ఆందోళన కార్య క్రమంలో వర్సిటీలోని అన్ని విభాగాల పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షల తేదీలు ప్రకటన

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో 2020-21 విద్యాసంవత్సరం బీఈడీ 4వ సెమిస్టర్ పరీక్షల రెగ్యూలర్ 1,2,3,4వ సెమిస్టర్ పరీక్షల బ్యాక్‌లగ్ ఫీజు చెల్లించేందుకు ఈ నెల 22 చివరి తేదీ అని, 100 రూ. అపరాద రుసుముతో 23వ తేదీ వరకు చెల్లించుకోవచ్చునని వర్సిటీ సీవోఈ ప్రొఫెసర్ అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు.

'పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి'

పెర్కిట్, జూలై 12: పిల్లల ఉజ్వల భవిష్యత్‌లో తండ్రిదే కీలక పాత్ర ఉంటుంది. ఈ సందర్భంగా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామి డిపల్లి నలంద పాఠశాలలో శుక్రవారం ఫాదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రీ స్కూల్ విద్యార్థులు వారి ఫాదర్స్‌తో ఆటలు ఆడుతూ ఆనందంగా గడిపారు. ఈ ఆటల్లో తండ్రులు వారి పిల్లలను ప్రోత్సహించాలి. ఈ సందర్భంగా పిల్లలు తండ్రుల మధ్య అప్యాయతను వెలికి తీసే విధంగా ఈ ఆటలను నిర్వహించామని, అదే విధంగా వారి భవిష్యత్ ఉన్నతంగా ఉండడానికి తండ్రులదే ప్రధాన పాత్ర ఉంటుందని పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్ అన్నారు. ఆటలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం అరుంధతి, శ్రావణి, నవనీత, మమత, జ్యోతి, అపూర్వ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలి

ఆర్మూర్‌రూరల్, జూలై12: చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్మూర్ సీఐ రవికుమార్ అన్నారు. మామిడిపల్లిలోని విజయ్‌హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన అంతర్గత క్రీడాపోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి రాణించాలని, అదే విధంగా కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించి రాణించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల దయనైందిన జీవితంలో చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శరీర ధృఢత్వం పెరగడంతో పాటు మానసికంగా, ఉల్లాసంగా ఉంటుందన్నారు. ఎస్సై అశోక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహ నాలు నడపవద్దని, దీంతో జరగరానిది జరిగితే ఎంతో నష్టపో తారన్నారు. సెల్‌ఫోన్ ఉపయోగం వల్ల కలిగే నష్టాలను వివరిం చారు. ఈ కార్యక్రమంలో విజయ్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ అమృతలత, ప్రధానోపాధ్యాయురాలు కవిత దివాకర్, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాటు కాలువ కల్వర్టును పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు


జన్నేపల్లి మాటు కాలువ కల్వర్టును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ

నవీపేట్ జూలై 12 : జన్నేపల్లి మాటు కాలువకు సంబంధించిన కల్వర్టును శుక్రవారం ఇరిగేషన్ డీఈ బలరాం పరిశీలించారు. జన్నేపల్లి వద్ద మాటు కాలువకు సంబంధించిన పురాతన కల్వర్టు పైపులతో నిర్మించి ఉండగా నీరుసరిగా ప్రవహించక కాలువకు మధ్యలోనే గండ్లు పడడంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదని పలువురు రైతులు ఇటీవల బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశం మేరకు శుక్రవారం సంబంధిత కల్వర్టును డీఈ పరిశీలించారు. ఇరిగేషన్, ఆర్అండ్‌బీ శాఖల సమన్వయంతో కల్వర్టు వద్ద పైపులను తొలగించి స్లాబ్ కల్వర్టు నిర్మించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఈ పేర్కొన్నారు. అలాగే సిరన్‌పల్లి సమీపంలో ఉన్న మరో పైపుల కల్వర్టును సైతం స్లాబ్‌కల్వర్టుగా మార్చడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఈ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీధర్, లక్ష్మణ్‌రావు తదితరులున్నారు.

కోటగిరిలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కోటగిరి, జూలై 12 : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బాబుజగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు విద్యాసాగర్, సాయిలు, దినేష్, పోశెట్టి, అబ్బయ్య, లాలయ్య, రవి, మక్కవ్వ, ఈరవ్వ తదితరులు పాల్గొన్నారు.

మొరం టిప్పర్ బోల్తా

కోటగిరి, జూలై12 : పొతంగల్ మండలంలోని హంగర్గఫారం గ్రామ సమీపంలో శుక్రవారం మొరం టిప్పర్ బోల్తాపడింది. సుంకిని రహదారికి మొరం తీసుకువెళ్తున్న వాహనం ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి పల్టీ కొట్టింది. ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. సాగుచేసిన పంట పొలంలో మొరంటిప్పర్ బోల్తాపడడంతో కాంట్రాక్టర్ మొరం టిప్పర్‌ను క్రేన్ సహాయంతో పక్కకు తీసి పెట్టారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్‌ను కలిసిన నాయకులు

మోస్రా,జూలై12: ఆషాఢ మాసం సందర్భంగా శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహాగంగా జలాభిషేకం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కాల్వసుజాతను మర్యాదపూర్వకంగా మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రం విశ్వనాథం, ఎస్‌కే.ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ వన్‌టైం బ్యాక్‌లాగ్ పరీక్షల్లో విద్యార్థి డిబార్

డిచ్‌పల్లి, జూలై 12 : తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీబ్యాక్‌లాగ్ వన్‌టైం పరీక్షలు గురువారం 11వ రోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు 111 మంది విద్యార్థులకు గాను 102 మంది హాజరయ్యారని, 8మంది గైర్హాజరయ్యారని చంద్రశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 226 మంది విద్యార్థులకు గాను 216 పరీక్షకు హాజరయ్యారని, 10మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. గిరిరాజ్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఒకరు చూచిరాతలకు పాల్పడుతూ డిబార్ అయ్యారని ఆడిట్‌సెల్ డైరెక్టర్ పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు బాలుడి మృతి

ఎడపల్లి, జూలై 12 : మండలంలోని రాణాకలాన్ గ్రామానికి చెందిన టేకులపల్లి నవదీప్ (14) అనే యువకుడు ప్రమాదవశాత్తు మరణించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నవదీప్ తన ఇంట్లో సామానును ఇంటి పైభాగంలో ఉన్న అటకపైన సర్దుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడన్నారు. ఈ క్రమంలో అటక తుడుసున్న చీర మెడకు ఉరిలా పడి మృతిచెందాడన్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘటన చోటుచేసుకోగా, కొంతసమాయానికి నవదీప్ తల్లి ఇంట్లోకి వచ్చి చూడగా తన కుమారుడి మెడకు చీర చుట్టుకుని ఉండడంతో వెంటనే హాస్పిటల్‌కు తరలించిందన్నారు. అప్పటికే మృతిచెందాడని డాక్టరు చెప్పాడని ఎస్సై వివరించారు. మృతుడి తండ్రి వినోద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజాపాలన దరఖాస్తులు పరిశీలించిన డీఈ

డిచ్‌పల్లి, జూలై 12 : ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకంలో అర్హులైన వారికి జీరోబిల్లుల దరఖాస్తులను డిచ్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని డివిజనల్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో గృహజ్యోతికి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అర్హులైన ప్రతి లబ్దిదారుడు జీరోబిల్లులు రాని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బాగేపల్లిలో ఈతమొక్కలు నాటిన ఎక్సైజ్ సీఐ

రెంజ్రాల్, జూలై 12 : మండలంలోని బాగేపల్లి గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవంలో భాగంగా బోధన్ సీఐ పవన్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలోని బేబీకుంట చెరువు గట్టుపై ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా బాగేపల్లి చెరువు గట్టుపై ఈత మొక్కలను నాటడం జరిగిందని, ఈ మొక్కలను సంరక్షించుకునే బాధ్యత గ్రామస్థులదేనని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఐదుమొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జలీల్, మాజీసర్పంచ్ సురేందర్ గౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షులు సాయిబాబా గౌడ్, సాయా గౌడ్, ఫీల్డ్‌అసిస్టెంట్ గోపి, ఎక్సైజ్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవం విజయవంతం చేయాలి

ముప్కాల్, జూలై 12 : బాల్కొండ మండలంలో వన మహోత్సవంలో భాగంగా చెట్లు నాటి వాటిని సంరక్షించాలని మండల ప్రత్యేక అధికారిణి రసూల్‌బీ అన్నారు. శుక్రవారం బాల్కొండ మండల కేంద్రంలో ఆమె మొక్కలు నాటారు. మండలంలోని ఆయా గ్రామాల్లో లక్ష మేరకు మొక్కలు నాటాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏపీవో ఇందిరా, ఎంపీడీవో విజయభాస్కర్, మల్లన్న గుట్ట కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థిని

నందిపేట, జూలై12: నందిపేట మండల కేంద్రానికి చెందిన ఆకృతి అనే విద్యార్థిని బాసర ట్రిపుల్ ఐటికి ఎంపికైంది. శుక్రవారం నందిపేట హైస్కూల్‌కు చెందిన 1989-90 పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు విద్యార్థినికి చేయూత అందించారు. రూ.10 విలువ చేసే మెటీరియల్‌ను అందజేశారు. అనంతరం ఆకృతిని వారు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో సిలిండర్ లింగం, మురళీధర్‌గౌడ్, వినోద్, మోహన్, హన్మాండ్లు, శ్రీనివాస్, తదితరులున్నారు.

సీజ్ చేసిన 1170 బస్తాల ఫర్టిలైజర్ విడుదల

రెంజల్,జూలై12: గత నెల రెంజల్ సొసైటీలో 1170 మందు బస్తాలను మండల వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి సీజ్ చేసిన మందు బస్తాలను కలెక్టర్‌కు నివేదిక పంపించడంతో కలెక్టర్ 53,300 రూపాయల జరిమానా విధించడంతో అట్టి జరిమానాను సొసైటీ వారు కట్టడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు 1170 బస్తాల ఫర్టిలైజర్ విడుదల చేయడం జరిగిందని వ్యవసాయ అధికారి లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. ఆయన వెంట సొసైటీ సీఈవో రాము తదితరులున్నారు.

దేవాంగ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు

వేల్పూర్, జూలై 12 : మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో దేవాంగ సంఘం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి రూ.5 లక్షల మంజూరయ్యాయి. శుక్రవారం. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ సహకారంతో మంజూరైన ప్రొసిడింగ్ కాపీని స్థానిక కాంగ్రెస్ నాయకులు గుడాల మోహన్, తక్కురి గంగాధర్‌లు దేవాంగ సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్టువతల నర్సయ్య, నచ్చన్న గారి గంగారెడ్డి, చేపూర్ మోహన్, నెహ్రూ, అలీం, జల్లభూమన్న, స్టూడియో బాబు, దేవాంగ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

బోధన్‌రూరల్, జూలై 12 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలకు దీటుగా చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని పీఆర్‌టీయూ డివిజన్ అధ్యక్షులు శంకర్ అన్నారు. శుక్రవారం బోధన్ మండలంలోని ఊట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమికపాఠశాలలో విద్యార్థులకు దాతల సహకారంతో నోట్‌పుస్తకాలు, వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ దాత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నతస్థాయికి వచ్చానని, ప్రభుత్వ పాఠశాలలో విద్య బలోపేతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సూర్యకుమార్, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్‌లతో మల్లికార్జున్, రవి, ధన్‌రాజ్, ఉపాధ్యాయ బృందం ఉమా, రాధ, సంతోషిణి, వీరేష్ బాబు, తదితరులున్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు 31వరకు పొడగింపు

బోధన్‌రూరల్, జూలై 12 : హైదరాబాద్ ఎస్సీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లో నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణకు ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అధికారి శశికళ, స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాజా గంగారాం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రాత పరీక్షల ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులై వార్షిక ఆదాయం 3లక్షలకు మించరాదని, ఆన్‌లైన్ దరఖాస్తులను ఈనెల 31వరకు వెబ్‌సైట్‌లో స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 040-23546552, 7702175493 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పరిసరాల అపరిశుభ్రత వల్లే వ్యాధులు

● నగర మేయర్ దండు నీతూకిరణ్

సుభాష్‌నగర్, జూలై 12: పరిసరాల అపరిశుభ్రత వల్లే సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని నగర పాలక సంస్థ మేయర్ దండునీతూకిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 14వ డివిజన్ డైరీఫాం ప్రాంతంలో కమీషనర్ మందమకరంద్‌తో కలిసి పరిశీలించారు. ఇటీవలే డెంగ్యూ వ్యాధిబారిన పడిన కుటుంబాన్ని పరిశీలించారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా డైరీఫాం ప్రాంతంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నగర మేయర్ దండునీతూకిరణ్ మాట్లాడుతూ డెంగ్యూ అపరిశుభ్రమైన నీటిలో పెరిగే దోమకాటు వల్ల వస్తుందని ప్రజలు ఎక్కువ నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా వ్యాధుల బారిన పడినట్లయితే స్థానిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేసుకొని మందులు తీసుకోవాలన్నారు. అనంతరం కమిషనర్ మంద మకరంద్ మాట్లాడుతూ.. ప్రజలు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇప్పటికే నగరంలో దోమల నివారణ చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, డిప్యూటీ కమీషనర్ రాజేంద్రకుమార్, అర్సపల్లి ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి స్వామౌట్, సానిటరి ఇన్స్‌పెక్టర్ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కొనసాగుతున్న తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సుభాష్‌నగర్, జూలై 12: నగర పాలక సంస్థ పరిధిలో రెవెన్యూ, సానిటేషన్ జాయింట్ సర్వే కొనసాగుతుంది. రెవెన్యూ విభాగం, సానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం సర్వే కొనసాగింది. నగరంలోని చెన్నై, సౌత్ ఇండియా షాపింగ్ మాల్స్‌లో డిప్యూటీ కమీషనర్ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. చెన్నై షాపింగ్ మాల్‌లో యూజర్ చార్జీలు సరిగ్గా చెల్లించడం లేదని, పార్కింగ్ ప్లేస్‌లో గోదాంలు నిర్వహిస్తున్నారని నోటీసులు జారీ చేశారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో ట్రేడ్ లైసెన్సుకు అనుగుణంగా చెల్లించకపోవడంతో నోటీసులు జారీ చేశారు. పాంగ్రా ప్రాంతంలో అనుమతి లేకుండా కమర్షియల్‌గా కొనసాగిస్తున్నారని ఫిర్యాదు రావడంతో వెంటనే స్పందించిన అధికారులు అక్కడికి వెళ్లి షోరూం యజమానికి నోటీసులు అందజేశారు. ఆగస్టు మొదటి కల్లా కమర్షియల్‌గా మార్చుకోవాలని కోరారు.

నగరంలో ప్రజాపాలన సేవ కేంద్రాల ఏర్పాటు

సుభాష్‌నగర్, జూలై 12: నగరంలో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామని నగర పాలక సంస్థ కమీషనర్ మందమకరంద్ తెలిపారు. నగరంలోని ఐదు ప్రాంతాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీ పథకాల అమలులో ప్రజాపాలన సేవా కేంద్రాలు పనిచేస్తాయని అన్నారు. ఉదయం 9.30ల నుంచి సాయంత్రం 5.30ల వరకు కేంద్రాలు తెరిచి ఉంటాయని అన్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల అప్లికేషన్‌లో అప్‌డేట్ చేయడానికి ఈ కేంద్రాలు ఉపయోగపడుతాయని అన్నారు. ప్రజలు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు. నాందేవ్‌వాడ వాటర్ ట్యాంక్ (సాయినరేంద్ర 8686574773), గోల్‌హనుమాన్ వాటర్ ట్యాంక్ (సుష్మిత 8096781186), బడా బజార్ వాటర్ ట్యాంక్ (నాగేష్ 99121377461), కంఠేశ్వర్ వాటర్ ట్యాంక్ (సతీష్ 9110515906), అర్సపల్లి వాటర్ ట్యాంక్ (ఖైఫ్ 7993843572) నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం

పెద్దబజార్, జూలై 12: తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని శుక్రవారం శంషాబాద్‌లోని మల్లిక కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథిగా కేంద్ర విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ హాజరై మాట్లాడుతూ జిల్లాలో పలు సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్, బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, అసెంబ్లీ కన్వీనర్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా మహిళా శక్తి లబ్ధిదారుల ఎంపిక



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

నిజామాబాద్ అర్బన్, జూలై 12: మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహిళా శక్తి కార్యక్రమం ద్వారా వివిధ యూనిట్ల స్థాపన కోసం పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో వివక్షను ప్రదర్శిస్తూ పొరపాట్లకు ఆస్కారం కల్పిస్తే సంబంధిత ఏపీఎంలను బాధ్యులుగా పరిగణిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో శుక్రవారం మహిళా శక్తి కార్యక్రమంపై జిల్లా, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, డీపీఎంలు, ఏపీఎంలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా శక్తి కార్యక్రమం ఉద్దేశాన్ని వివరిస్తూ మహిళలను ఆర్థికంగా మరింత ప్రగతిబాటలో పయనింపజేయాలని సంకల్పంతో ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమాన్ని చేపట్టిందని ఇప్పటికే పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టించే బాధ్యతతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడులలో పనులను సైతం స్వయం సహాయక సంఘాల ద్వారానే కొనసాగిస్తుందని గుర్తు చేశారు. జిల్లాలో సుమారు లక్షా 80వేల యూనిఫాంలను కుట్టే బాధ్యతను మహిళా సంఘాలకు అందిస్తున్నామని తద్వారా ఒక్కో జత కుట్టుకూలి 75 రూపాయల చొప్పున మహిళా సంఘాలకు సుమారు కోటిన్నర రూపాయల వరకు ఆదాయం సమకూరుతుందన్నారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళా సంఘాలలో ఔత్సాహిక సభ్యులకు వారి అభిరుచికి అనుగుణంగా వివిధ యూనిట్ల స్థాపన కోసం ఎంపిక చేసే ప్రక్రియ పూర్తి పాదర్శకంగా జరగాలని కలెక్టర్ ఏపీఎంలను ఆదేశించారు. ఆసక్తి, అభిరుచి, నైపుణ్యత, స్థానిక మార్కెట్ పరిస్థితులు వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని సభ్యులను ఎంపిక చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో మహిళా సంఘాల సభ్యులను కలిసి వారికి ఏరంగంలో ఆసక్తి ఉందో స్థానికంగా మార్కెట్ స్థితిగతులను అధ్యయనం చేసి వివిధ యూనిట్ల స్థాపన కోసం బ్యాంకు రుణాలు ఇప్పించడం, నాణ్యమైన ఉత్పాదకత, మార్కెటింగ్ వంటి వాటికి తోడ్పాటును అందించాలన్నారు. వచ్చేవారం మలివిడత సమావేశం నిర్వహిస్తామని, సమగ్ర వివరాలతో రావాలని ఎక్కడైనా లోపాలు ఉంటే ఏపీఎంలపై చర్యలు తప్పవన్నారు. మహిళా శక్తి కార్యక్రమాన్ని మహిళా సంఘాలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకేరకమైన యూనిట్లను కాకుండా మార్కెట్ డిమాండ్, తమ తమ నైపుణ్యాలకు అనుగుణంగా యూనిట్లను ఎంచుకొని పూర్తి శక్తి సామర్థ్యాలతో నిర్వహించి ఆర్థిక ప్రగతిని సాధించాలన్నారు. ఈ అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ అంకిత్, డిఆర్‌డివో సాయాగౌడ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్‌చౌహాన్, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి జగన్నాథచారి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సురేష్‌కుమార్, ఫిషరిస్ ఏడీ రాజనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి గర్జనలో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు

విద్య కాషాయీకరణకు
వ్యతిరేకంగా పోరాటం

నిజామాబాద్ అర్బన్, జూలై 12: విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, పాలిగంజ్ ఎమ్మెల్యే సందీప్ సౌరబ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బస్వాగార్డెన్‌లో నిర్వహిస్తున్న ఐసా సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యావిధానం ద్వారా కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యారంగ కేంద్రీకరణ, ప్రైవేటీకరణ, కాషాయికరణ విధానాలను ఐసా నేతలు తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాప్రైవేటీకరణ విషయంలో కేంద్రానికి మద్దతు తెలపడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులలో కోత విధిస్తూ యూనివర్సిటీలను ప్రభుత్వ విద్యను పేద విద్యార్థులకు దూరం చేయాలని కుట్ర చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వినాయక్‌నగర్ చౌరస్తా నుంచి బస్వాగార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సభకు జ్వాలా అధ్యక్షత వహించగా ఐసా జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రసేన్‌జిత్ , మామిడ్ల రమేష్, ఉదయ్‌కిరణ్, కిరణ్‌కుమార్, వీరునాయక్, తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీలను
నిర్లక్ష్యం చేయడం సరికాదు'

పెద్దబజార్, జూలై 12: ప్రభుత్వం వృద్ధాప్యంలో కూడా అంగన్‌వాడిలను నిర్లక్ష్యం చేయడం సరైందికాదని అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్ బాబు అన్నారు. శుక్రవారం నగరంలోని ధర్నాచౌక్ వద్ద కొనసాగుతున్న ఏడవ రోజు నిరసనలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడి ఉద్యోగులకు 60 సంవత్సరాలు నిండిన వారిని జూలై 1వ తేదీ నుంచి విధుల్లోకి రాకూడదని ఆదేశించిన ప్రభుత్వం జివో నంబరు 10ని ఉపసంహరించుకొని గత ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని అంగన్‌వాడి టీచర్లకు 2లక్షల రూపాయలు, ఆయాలకు లక్ష రూపాయల రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇచ్చి వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని అన్నారు. గత వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా రిలే దీక్షలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. 30, 40 సంవత్సరాల వరకు అనేక మంది పిల్లలకు సేవలు అందించడంతో పాటు అనేక ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేయడానికి సహకరించిన వారిని చివరి దశలో ఇబ్బందులు పెట్టడం సరైంది కాదన్నారు. గత ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయకుండా దాట వేయడం వారికి తగిన గుణపాఠం చెప్పే పరిస్థితి ఏర్పడిందని నేటి ప్రభుత్వం వారి సమ్మె సందర్భంగా తాము అంగన్‌వాడిలను ఆదుకుంటామని సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోకుండా వదిలివేయడం మూలంగా ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే రిటైర్డ్ అంగన్‌వాడి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని లేనియెడల ఆందోళనలు ఉధృతం చేయాల్సి వస్తుందని దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అంగన్‌వాడీ ఉద్యోగులు కళావతి, సావిత్రి, లక్ష్మి, జరీనా, తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ఎన్నికలకు నోటిఫికేషన్

నిజామాబాద్ అర్బన్, జూలై 12: యువజన కాంగ్రెస్ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎన్నికల అధికారి ప్రశాంత్ తెలిపారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువజన కాంగ్రెస్‌కు సంబంధించి ప్రస్తుతం ఉన్న కార్యవర్గం కాలపరిమితి ముగిసినందున నాయకత్వ లక్షణాలు, రాజకీయాల్లో రాణించాలనుకునే యువతీ యువకులు ఎన్నికల్లో పోటీ చేసి నాయకులుగా ఎదిగే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంతో మంది నాయకులను తయారు చేసిన చరిత్ర యువజన కాంగ్రెస్‌కు ఉందని మండల, అసెంబ్లీ, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీ చేయాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విక్కియాదవ్, నవాజ్, ముదస్సీర్, శుభం, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూలై 12: తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీపైబడిన కోర్సులలో కుల విద్యార్థులు 80 శాతంకు పైగా మార్కులు పొందినట్లయితే వారు ప్రతిభా పురస్కారాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని రాష్ట్ర వంజరి సంఘం ఉపాధ్యక్షులు మాస్టర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోగల సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 31లోపు తమ మార్కుల మెమో, బయోడెటాతో దరఖాస్తులను అందజేస్తే వాటిలో నుంచి ఎంపిక చేయబడిన వారికి ఆగస్టు 15న రాష్ట్ర వంజరి సంఘం ఆధ్వర్యంలో పురస్కారాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 9848490055, 9849391493 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు కాలేరు గడ్డం శ్రీనివాస్, మాయావర్ సాయిరాం, గంగాధర్, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కురియన్ కమిటీతో జిల్లా నాయకుల భేటీ

నిజామాబాద్ అర్బన్, జూలై 12: పార్లమెంట్ ఎన్నికలపై సమీక్షించేందుకు గాంధీభవన్‌లో నిర్వహించిన కురియన్ కమిటీ సమీక్షకు జిల్లాకు చెందిన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, తదితరులు హాజరయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన సమీక్షకు సుదర్శన్‌రెడ్డితో పాటు రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, బాల్కొండ ఇంచార్జి సునీల్‌రెడ్డిలు పాల్గొన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నివేదికను కురియన్ కమిటీకి అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

సిరికొండ, జూన్ 12: నాటిన మొక్కలను సంరక్షించుకుని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సిరికొండ హైస్కూల్ హెచ్‌ఎం సతీష్‌కుమార్ గౌడ్ కోరారు. హైస్కూల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవులు తరగిపోతున్నందున గ్రామాల్లో, రోడ్లకు ఇరువైపుల, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటాలని ఆయన సూచించారు. నాటిన ప్రతి మొక్క ఏపుగా పెరుగడానికి కృషి చేయాలన్నారు. మనావ మనుగడకు చెట్లు కీలకమని ప్రధానోపాధ్యాయులు చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన కోరారు.

ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించాలి

సిరికొండ, జూన్ 12: ఉపాధిహామీ కూలీలకు డబ్బులు చెల్లించాని ఏఐకేఎంఎస్ సిరికొండ మండల అధ్యక్షుడు నిమ్మల భూమేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. మండలంలోని గడ్కోల్ గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు ఐదు నెలల నుంచి కూలీ డబ్బులు ఖాతాల్లో పడడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే కూలీల ఖాతాల్లో డబ్బులను జమ చేయాలని భూమేష్ కోరారు. ఈ సమావేశంలో నాయకులు గులాం హుస్సేన్, రాములు, కృష్ణా, ఎల్లయ్య, సంజీవ్, సాయన్న, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



గూపన్‌పల్లిలో గ్రామదేవతలకు జలాభిషేకం చేస్తున్న దృశ్యం

గ్రామదేవతలకు జలాభిషేకం

నిజామాబాద్ రూరల్, జూలై, 12: వానలు సంవమృద్ధిగా కురవాలని కోరుతూ గ్రామస్తులు గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 3వ డివిజన్ గూపన్‌పల్లిలో బాసర గోదావరి నది నుంచి గంగాజలాన్ని తీసుకువచ్చారు. స్థానిక కార్పొరేటర్ చిటికె శ్రీనివాస్ రెడ్డి ఆలయంలో ప్రత్యేకంగా మొక్కుకున్నారు. అనంతరం గ్రామస్తులు గంగాజలాన్ని కూడళ్లలో తిప్పుతూ గ్రామ శివారులోని గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు.

గుండారంలో..

రూరల్ మండలం గుండారం గ్రామంలో గ్రామస్తులు బాసర నుంచి తీసుకువచ్చిన గంగాజలాన్ని గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. వీడీసీ సభ్యులు పోతన, శంకర్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, అంకల గంగాధర్ తదితరులు గంగాజలాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామ కూడళ్లలో జలాన్ని పోస్తూ చివరకు గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సంవృద్ధిగా వస్తే అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటామని మొక్కుకున్నారు.

గోల్‌హనుమాన్ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

పెద్దబజార్, జూలై 12: నగరంలోని గోల్‌హనుమాన్ దేవాలయంలో హుండీ లెక్కింపును శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకురాలు కమల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ లెక్కింపులో నోట్ల రూపంలో 42వేల 180 రూపాయలు, నాణెముల రూపంలో 5వేల 805 రూపాయలు, మొత్తం 47వేల 985 రూపాయలు హుండీ ఆదాయం వచ్చినట్లు ఆమె తెలిపారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి జి.వేణు, అర్చకులు జయరాజ్ జోషి, నీలేష్, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్‌కుమార్, సాయికిరణ్, ఆలయ సిబ్బంది, విష్ణు సహస్రనామ పారాయణ భక్తబృందం, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఉద్యమంలా మొక్కలు నాటాలి

ధర్పల్లి, జూలై 12: మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా కొనసాగించాలని ఎండీవో బాలకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో నర్సరీ నుంచి మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి గ్రామంలో 9వేల మొక్కలను నాటడమే లక్ష్యంగా అధికారులు, యువకులు ముందుండాలని సూచించారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీలో 22 నర్సరీలను ఏర్పాటు చేశామని నర్సరీలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ప్రతి వ్యక్తి మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫ్రైడేను డ్రైడేగా జరుపుకోవాలి

ధర్పల్లి, జూలై 12: ప్రతి శుక్రవారం గ్రామాల్లో నీటి నిల్వలు ఉండకుండా గ్రామస్తులను చైతన్య పర్చాలని ఎంపిడివో బాలకృష్ణ సూచించారు. ఫ్రైడే డ్రైడేగా నిర్వహించాలని వైద్య సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. నీటి నిల్వలు ఉన్న వాటిని పరిశీలించి వెంటనే నీటిని తొలగించారు. నీటి నిల్వల వల్ల దోమలు వ్యాపించి డెంగ్యూ, మలేరియా వ్యాధులు వ్యాపిస్తాయని ఆయన గ్రామస్తులను చైతన్యపరిచారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురికి నీరు, నీటి నిల్వలు, చెత్తా చెదారం ఉండకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో సైఫొద్దీన్, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ఇందల్వాయి, జూలై 12: మండలంలోని ఇందల్వాయి గ్రామానికి చెందిన గుజ్జరి వెంకటి అనే వ్యక్తి ఆరోగ్యంపాలై గత పది రోజుల నుండి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చికిత్స నిమిత్తం 6లక్షల రూపాయల వరకు ఖర్చు కావడంతో గ్రామానికి చెందిన యువతరం యూత్ సభ్యులు ఆయన చికిత్స నిమిత్తం 20,500 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. వెంకట్ గత పదిరోజులుగా నిజామాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని అన్నారు. యువతరం యూత్ తరఫున తమ వంతు సహాయం అందించామని వెంకట్ త్వరలోనే కోలుకొని ఆరోగ్యంగా తిరిగి రావాలని భవవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువతరం యూత్ సభ్యులు పాల్గొన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్

జైలు ఆవరణలో మొక్కలు నాటిన కమిషనర్



మొక్కను నాటుతున్న దృశ్యం

నిజామాబాద్ రూరల్, జూలై, 12: నగర శివారు సారంగపూర్‌లోని జిల్లా జైలును మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మంద మకరంద్ పరిశీలించారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ సిబ్బందితో కలిసి కమిషనర్ జిల్లా కారాగారానికి వచ్చారు. జిల్లా సూపరింటెండెంట్ ప్రమోద్ కుమార్ బల్దియా అధికారులకు జైలును చూపించారు. ఖైదీలతో ఏర్పాటుచేసిన నర్సరీని చూశారు. నర్సరీలో పెంచుతున్న వివిధజాతు మొక్కలనుచూసి కమిషనర్ మకరంద్ ప్రశంసించారు. అవసరమైనవారికి మొక్కలు అందించాలని సూపరింటెండెంట్ ప్రమోద్‌కుమార్‌ను కోరారు. అనంతరం జైలు ఆవరణలో కమిషనర్ మకరంద్ మొక్కనునాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రమోద్, జైలర్ రాజశేఖర్ రెడ్డి, బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.